క్లుప్తంగా

పార్థివ శివలింగాల తయారీకి శ్రీకారం



పార్థివ శివలింగాల తయారీలో నిమగ్నమైన మహిళలు

అనపర్తి: శ్రీవాసవి కన్యకా పరమేశ్వరి వైశ్య సంఘం వారి ఆధ్వర్యంలో నిర్వహించే పూజా కార్యక్రమాల్లో వినియోగించేందుకు గాను పార్థివ శివలింగాల తయారీకి అనపర్తి శ్రీవాసవి ఆదర్శ వనిత క్లబ్ నేతృత్వంలో మహిళలు బుధవారం శ్రీకారం చుట్టారు. స్థానిక పాతవూరులోని ఉమారామలింగేశ్వర స్వామివారి ఆలయ ప్రాంగణంలో ఆలయ చైర్మన్ పోతంశెట్టి శ్రీనివాసరెడ్డి పర్యవేక్షణలో నిర్వహిస్తున్న ఈ కార్యక్రమంలో బుధవారం ఉదయం ముందుగా గణపతి పూజ చేసిన అనంతరం పార్థివ శివలింగాల తయారీని ప్రారంభించారు. 15 రోజుల వ్యవధిలో మొత్తం రెండు లక్షలు పార్థివ శివలింగాలు తయారు చేయడాన్ని లక్ష్యంగా నిర్ణయించుకున్నట్లు క్లబ్ ప్రతినిధి గ్రంధి సుజాత తెలిపారు.

రేపు మండల పరిషత్ సాధారణ సమావేశం

రంగంపేట: స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో శుక్రవారం మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.శ్రీరామరాజు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ రిమ్మలపూడి శ్రీదేవి అధ్యక్షతన జరిగే ఈ సమావేశానికి జెడ్పీటీసీ సభ్యుడు పేపకాయల రాంబాబు, జిల్లా పరిషత్ కో–ఆప్షన్ సభ్యుడు లంక చంద్రన్నతో పాటు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు హాజరవుతారన్నారు. మండల స్థాయి అధికారులందరూ తమ శాఖల ప్రగతి వివరాలతో సమావేశానికి తప్పనిసరిగా హాజరు కావాలన్నారు.

అనుమతులు లేకుండా ర్యాలీలొద్దు

బిక్కవోలు: ఈ నెల 14న భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ జయంతి సందర్భంగా అనుమతులు లేకుండా ర్యాలీలు నిర్వహించొద్దని సీఐ పి.శివగణేష్ అన్నారు. బుధవారం ఆయన పందలపాక, బలభద్రపురం గ్రామాల్లో పర్యటించిన ఆయన స్థానిక కమిటీ పెద్దలతో మాట్లాడుతూ ఎన్నికల నేపథ్యంలో డీజేలకు అనుమతి లేదన్నారు. అంబేడ్కర్ విగ్రహం ఉన్నచోట పూలమాలలు వేసి నివాళులర్పించాలని సూచించారు. ఎన్నికల్లో కోడ్ ఉల్లంఘించి ఎటువంటి అనుమతులు లేకుండా ర్యాలీలు చేస్తే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామన్నారు. కార్యక్రమంలో ఎస్‌ఐ పి.బుజ్జిబాబు తదితరులు పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి



ఆరబెట్టిన ధాన్యాన్ని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.విజయకుమార్

పెదపూడి: ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా వ్యవసాయశాఖ అధికారి ఎన్.విజయకుమార్ అన్నారు. బుధవారం ఆయన మండలంలోని జి.మామిడాడ రైతుభరోసా కేంద్రాన్ని సందర్శించి రైతులు రోడ్డుపై ఆరబోసిన ధాన్యం నమూనాని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులంతా దళారులను నమ్మి మోసపోకుండా ధాన్యం కొనుగోలు కేంద్రాల్లోనే ధాన్యం విక్రయించాలన్నారు. కనీసం మద్దతు ధర 75 కేజీలకు గాను రూ.1,635, ఏ గ్రేడ్ రకానికైతే 75 కేజీలకు రూ.1,652 చెల్లిస్తామన్నారు. తేమ శాతం 17 కంటే తక్కువగా ఉండేలా చూసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ శాఖ అధికారి మణిదీప్, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఓటు హక్కుపై అవగాహన సదస్సు



ప్లకార్డులతో నినాదాలు చేస్తున్న ఉద్యోగులు

రాజానగరం: ఎన్నికల్లో ఓటు హక్కు వినియోగంపై స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో బుధవారం అవగాహన సదస్సు జరిగింది. రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును ప్రతిఒక్కరూ సక్రమంగా, నిజాయితీగా వినియోగించాలని వక్తలు సూచించారు. కరెన్సీ నోటుకు అమ్ముడుపోకుండా, ప్రజాస్వామ్య పరిరక్షణకు ఉపయోగించాలన్నారు. అనంతరం కార్యాలయం నుంచి సాయిబాబా గుడి సెంటరుకు చేరుకుని, ప్లకార్డులతో ఓటు హక్కు వినియోగంపై ఓటర్లను చైతన్యపరిచారు. ఎంపీడీఓ జ్యోతిర్మయి, ఎంఈఓ రామన్నదొర, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

బీమాతో ధీమా

- పేదలకు కొండంత అండ
- రేషన్ కార్డుదారులకు వర్తింపు
- లబ్ధిదారుల వివరాల సేకరణలో యంత్రాంగం



సీతానగరంలో వైఎస్సార్ బీమాకు వివరాలు సేకరిస్తున్న వలంటీర్ (ఫైల్)

సీతానగరం: ప్రమాదవశాత్తు కానీ, సహజ మరణంతో కానీ ఇంటి యజమాని చనిపోతే.. ఏ పేద, సామాన్య కుటుంబం రోడ్డున పడకూడదనే ఉద్దేశంతో రాష్ట్ర ప్రభుత్వం వైఎస్సార్ బీమా పథకాన్ని ప్రవేశపెట్టింది. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల భాగస్వామ్యంతో రూపొందించిన ఈ పథకం అమలు బాధ్యతను పూర్తిగా వైఎస్సార్ సీపీ ప్రభుత్వం తీసుకుంది. గతంలో కేంద్ర ప్రభుత్వ ఆర్థిక సహకారంతో ఈ పథకం అమలయ్యేది. అయితే సక్రమంగా అమలు జరగని కారణంగా కేంద్ర ప్రభుత్వం తన వాటా ఆర్థిక సాయాన్ని నిలిపివేసింది. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చొరవతో మొత్తం ప్రీమియంను భరిస్తూ వైఎస్సార్ బీమా పథకాన్ని అమలు చేస్తోంది. నిరుపేదల సంక్షేమమే లక్ష్యంగా, రైస్‌కార్డు కలిగిన ప్రతి కుటుంబాన్ని పోషించే వ్యక్తి దురదృష్టవశాత్తు మరణించినా.. ఆ వ్యక్తిపై ఆధారపడిన కుటుంబం రోడ్డునపడరాదని ఈ బీమా పథకం భారాన్ని ప్రభుత్వం తీసుకుంది. వలంటీర్ల ద్వారా అధికారులు సర్వే చేయించి, లబ్ధిదారుల వివరాలు నమోదు చేసుకున్నారు. నియోజకవర్గంలోని సీతానగరం మండలంలో 23,640, కోరుకొండ మండలంలో 25,651, రాజానగరం మండలంలో 32,895 రైస్ కార్డులున్నాయి.

పథకానికి అర్హతలు..

- ఈ పథకంలో నమోదు కావాలంటే తప్పనిసరిగా రైస్ కార్డు ఉండాలి. కుటుంబాన్ని పోషించే వ్యక్తికే బీమా వర్తిస్తుంది.
- ఆ వ్యక్తికి భార్య/ 21 ఏళ్లు పూర్తికాని కుమారుడు/ పెళ్లికాని కుమార్తె/ వితంతువు అయిన కూతురు బీమాదారునితో ఉంటే/ బీమాదారునిపై ఆధారపడిన తల్లిదండ్రులు/ వితంతువు అయిన కోడలు లేదా ఆమె పిల్లలు నామినీగా ఉంటారు. భర్త చనిపోతే ఆ స్థానంలో భార్య ఉంటే ఆమె పేరున బీమా కొనసాగుతుంది. గ్రామీణ ప్రాంతాల్లో రూ.10 వేలు, పట్టణ ప్రాంతాల్లో రూ.12 వేల లోపు ఆదాయం కలిగి ఉండాలి. మాగాణి 2.5 ఎకరాలు, మెట్ట 5 ఎకరాల లోపు ఉండాలి. ఏదైనా జాతీయ బ్యాంకులో ఖాతా ఉండాలి.

ప్రయోజనాలివే..

వైఎస్సార్ బీమా పథకంలో నమోదైన 18 నుంచి 50 ఏళ్ల వయస్సు వారు సహజ మరణం పొందితే రూ.2 లక్షలు, ప్రమాదశాత్తు మరణిస్తే రూ.5 లక్షల బీమా వర్తిస్తుంది. 51 నుంచి 60 ఏళ్ల వారు ప్రమాదవశాత్తు మరణిస్తే రూ.3 లక్షల బీమా వస్తుంది. బీమాదారునికి గుర్తింపు కార్డు ఇస్తారు. క్లెయిమ్ సొమ్ము నేరుగా వారి బ్యాంకు ఖాతాకు జమ అవుతుంది. ఈ ఖాతా ఎప్పుడూ వినియోగంలో ఉండాలి.

రైస్ కార్డు ఉంటే అర్హులే..

‘వైఎస్సార్ బీమా పథకం కింద రైస్‌కార్డ్ కలిగిన ప్రతి లబ్ధిదారు అర్హుడే. వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి లబ్ధిదారుల వివరాలు, బ్యాంకు ఖాతా, నామినీ వివరాలు సేకరించారు. అర్హులందరూ ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారు.’

– కృష్ణప్రసాద్, ఎంపీడీఓ, సీతానగరం

వైఎస్సార్ సీపీ విస్తృత ఎన్నికల ప్రచారం



కోరుకొండలో ప్రచారం చేస్తున్న నాయకులు

మధురపూడి: సార్వత్రిక ఎన్నికల ప్రచారం జోరుగా సాగుతోంది. వైఎస్సార్ సీపీ నాయకులు బుధవారం స్థానిక రథం రోడ్డులో ప్రచారం చేపట్టారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి, సంక్షేమాన్ని గుర్తుపెట్టుకుని ప్రజలు ఫ్యాను గుర్తుకు ఓటు వేయాలని కోరారు. ముఖ్యమంత్రిగా వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని, ఎమ్మెల్యేగా జక్కంపూడి రాజాను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. కోరుకొండలో రథం రోడ్డు నుంచి గానుగవీధి, అంకాలమ్మ గుడి ప్రాంతాల్లో ప్రచారం సందడిగా సాగింది. రాజానగరం నియోజకవర్గంలో కోరుకొండ రథం రోడ్డు నిర్మాణం, సీసీ రోడ్లు, డ్రైన్లు, జేజేఎంలో ఓవర్ హెడ్ ట్యాంకులు నిర్మించినట్లు నాయకులు వివరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ గ్రామశాఖ అధ్యక్షుడు పసుపులేటి బుల్లియ్యనాయుడు, ఎంపీటీసీ సభ్యులు గొల్లపల్లి ప్రవీణ్‌కుమార్, కాళ్ల వీరబాబు, పార్టీ మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు రాజా రమాదేవి, నాయకులు తాడి హరిశ్చంద్రప్రసాద్‌రెడ్డి, బొరుసు బద్రి, నీరుకొండ బాబ్జీ, వాకా నరసింహరావు తదితరులు పాల్గొన్నారు.

కోరుకొండ మసీదులో ఇఫ్తార్ విందు



ఇఫ్తార్ విందులో పాల్గొన్న ముస్లింలు

మధురపూడి: రంజాన్ సందర్భంగా కోరుకొండ పంచాయతీ కార్యాలయానికి సమీపంలోని మసీదులో బుధవారం ముస్లింలు ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందుకు వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముస్లిం సోదరుల ఉపవాస దీక్షలు భక్తిభావానికి ప్రతీకమన్నారు. ఆమెతో పాటు, పార్టీ నాయకుడు సత్యనారాయణ ముస్లిం సోదరులకు రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా వక్ఫ్ బోర్డు సభ్యులు షేక్ బిజిలాని, మసీదు పెద్దలు సుభాన్, బాషా, ఇబ్రహీం తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమ పాలనకు ఓటు వేయండి

- వైఎస్సార్ సీపీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి
- గాదరాడలో ఎన్నికల ప్రచారం



గాదరాడలో ఎన్నికల ప్రచారం చేస్తున్న జక్కంపూడి విజయలక్ష్మి

మధురపూడి: అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను విజయవంతంగా అమలు చేస్తున్న వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని సీఎం చేసేందుకు వైఎస్సార్ సీపీకి ఓటు వేయాలని పార్టీ పీఏసీ సభ్యురాలు జక్కంపూడి విజయలక్ష్మి విజ్ఞప్తి చేశారు. కోరుకొండ మండలం గాదరాడ గ్రామంలో బుధవారం ఆమె ఇంటింటికీ తిరిగి ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుష్ట రాజకీయాలను అడ్డుకోవడానికి ప్రజలంతా సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. ఈ ఎన్నికలు పేదలకు, పెత్తందారులకు మధ్య జరుగుతున్న పోరాటమన్నారు. పేదల పక్షపాతి జగన్ పక్షాన ప్రజలంతా నిలబడాలన్నారు. గాదరాడలో సీసీ రోడ్లు, మురుగునీటి కాలువలు, ఓవర్‌హెడ్ ట్యాంకులను నిర్మించారని, కలవచర్ల నుంచి గాదరాడకు పైపులైన్ నిర్మాణం ద్వారా మంచినీటి సమస్యను పూర్తిగా పరిష్కరించారని వివరించారు. రాజానగరం నియోజకవర్గంలో పల్లెలను పాడిపంటలతో అభివృద్ధి నిలయాలుగా మార్చడంతో పాటు, అభివృద్ధి, సంక్షేమ పథకాలను అమలు చేసిన తన కుమారుడు రాజాను ఫ్యాను గుర్తుపై ఓటేసి మళ్లీ గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.

అభివృద్ధిని చెప్పి.. ఓట్లు అడగండి



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా

రాజానగరం: ఎన్నికల సమయంలోనే జనాల ముంగిటకు వచ్చే రాజకీయ నాయకుల్లా కాకుండా, జనం కోసం.. జనంలో ఒకరిగా మమేకమైన మనం గడచిన ఐదేళ్లలో ప్రజా సంక్షేమానికి, గ్రామాభివృద్ధికి ఏ పనులు చేశామో చెప్పండి, నిర్భయంగా ఓట్లు అడగండి.. అని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా పార్టీ కేడర్‌కు దిశానిర్దేశం చేశారు. మండలంలోని పుణ్యక్షేత్రంలో స్థానిక పార్టీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం సమావేశమయ్యారు. రాబోయే సార్వత్రిక ఎన్నికల్లో అత్యధిక మెజార్టీతో విజయం సాధించే దిశగా ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలన్నారు. ఎన్నికల సమయంలో ఇబ్బడిముబ్బడిగా హామీలు గుప్పించడం, అధికారంలోకి వచ్చాక మొహం చాటేసే గత పాలకుల మాదిరిగా కాకుండా, ప్రజలకు ఇచ్చిన హామీలను 99 శాతం పైబడి నెరవేర్చిన ప్రభుత్వం తమదన్నారు. గాంధీ మహాత్ముడు కలలుగన్న గ్రామ స్వరాజ్యాన్ని మాటల్లో కాకుండా, గ్రామ సచివాలయ వ్యవస్థ ద్వారా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతల్లో చూపారన్నారు. గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి కోట్లాది రూపాయల నిధులు వెచ్చించామన్నారు. పుణ్యక్షేత్రం గ్రామంలోనే రూ.9 కోట్లతో పలు అభివృద్ధి పనులు చేపట్టామని, విద్యార్థులకు ఉన్నత విద్యను అందించేలా జూనియర్ కాలేజీని ఏర్పాటు చేశామన్నారు. అలాగే నవరత్నాలు పథకాల ద్వారా పేదల సంక్షేమానికి, మహిళల అభ్యున్నతికి కృషి చేశామన్నారు. కులాలు, మతాలు, వర్గాలు చూడకుండా, అర్హత ఉంటే చాలు ప్రతిఒక్కరికీ సంక్షేమ పథకాలను అందించిన ప్రభుత్వం తమదేనన్నారు. ఇదే ఒరవడిని మరికొంత కాలం కొనసాగించడం ద్వారా రాష్ట్ర ప్రగతిని మరింత వేగవంతం చేయవచ్చన్నారు. అందుకుగాను వచ్చే ఎన్నికల్లో ప్రజలంతా ఫ్యాన్ గుర్తుకు ఓటు చేసేలా చైతన్యపర్చాలని కేడర్‌కి సూచించారు. సమావేశంలో సర్పంచ్ మరుకుర్తి వెంకటేశ్వరరావు, నాయకులు శ్రీనాథ్, పేపకాయల రాంబాబు, పేపకాయల ఈశ్వరరావు, కర్రి వీరబాబు, పలివెల రామాంజనేయులు, లోశెట్టి వీరబాబు, యర్రగాల శ్రీను, యర్రంశెట్టి శ్రీనివాసరావు, ముమ్మిడి దుర్గారావు తదితరులు పాల్గొన్నారు.

మరోసారి అవకాశం ఇవ్వండి

జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ



ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ రాజశ్రీ

రాజానగరం: దేశంలో ఎక్కడా అమలు చేయనన్ని సంక్షేమ పథకాలను రాష్ట్రంలో అమలు చేస్తూ, ప్రజా సంక్షేమానికి పెద్దపీట వేసిన జగనన్న ప్రభుత్వానికి మరోసారి అవకాశమివ్వాలని స్థానిక ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు జక్కంపూడి రాజా సతీమణి డాక్టర్ రాజశ్రీ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. మండలంలోని పల్లకడియంలో స్థానిక వైఎస్సార్ సీపీ నాయకులతో కలిసి బుధవారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్లి గడచిన ఐదేళ్లలో జరిగిన అభివృద్ధిని, అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరిస్తూ, రాబోయే ఎన్నికల్లో ఫ్యాన్ గుర్తుకు ఓటు చేసి, ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులను అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు.

ఉచిత వైద్య శిబిరం

రాజమహేంద్రవరం రూరల్: హుకుంపేటలో కేపీఆర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో బుధవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. దివంగత కోటంశెట్టి వెంకాయమ్మ, కోటంశెట్టి అప్పలనరసమ్మ జ్ఞాపకార్థం కోటంశెట్టి రాజబాబు ఈ ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. వివిధ విభాగాల వైద్య నిపుణులు రోగులను పరీక్షించి, ఉచితంగా మందులను పంపిణీ చేశారు. వైద్య నిపుణులు కృష్ణసందీప్, రామ్‌గోపాల్‌తేజ కోట్ల, పేపకాయల మాణిక్యాంబ వైద్య సేవలందించారు. అదేవిధంగా హుకుంపేట పంచాయతీ కార్యాలయం ఎదురుగా కేపీఆర్ ఫౌండేషన్, కేపీఆర్ వాటర్‌ప్లాంట్ ఆధ్వర్యంలో చలివేంద్రం ప్రారంభించారు. ప్రజలకు మజ్జిగ ప్యాకెట్లను పంపిణీ చేశారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభించి గ్రామస్తులకు మజ్జిగ అందజేస్తున్న సత్తి బుల్లిస్వామిరెడ్డి

అనపర్తి: వేసవిలో ఎండ తీవ్రత దృష్ట్యా జన సంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో స్వచ్ఛంద సంస్థలు చలివేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమని ఎస్‌బీఎస్‌ఆర్ చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ సత్తి బుల్లిస్వామిరెడ్డి అన్నారు. మండలంలోని కుతుకులూరుకు చెందిన శంఖు చక్రధర చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని బుల్లిస్వామిరెడ్డి బుధవారం ప్రారంభించారు. చలివేంద్రం వద్ద రోజూ గ్రామానికి చెందిన తిరుమల తిరుపతి వెంకటేశ్వర వాటర్ ప్లాంట్ నుంచి మజ్జిగ, కూలింగ్ వాటర్ అందజేస్తామని నిర్వాహకులు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ గొల్లు హేమతులసి, ఉపసర్పంచ్ సబ్బెళ్ల నాగిరెడ్డి, ఎంపీటీసీ సత్తి దొరయ్యరెడ్డి, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పడాల సత్యనారాయణరెడ్డి, నల్లమిల్లి నాగిరెడ్డి, ద్వారంపూడి వీర్రెడ్డి, సత్తి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

8 మంది వలంటీర్ల రాజీనామా



పంచాయతీ కార్యదర్శికి రాజీనామా పత్రాలను అందజేస్తున్న వలంటీర్లు

రాజానగరం: ప్రభుత్వం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను లబ్ధిదారులకు సకాలంలో అందజేస్తూ, నిస్వార్థ సేవలను అందిస్తున్న తమపై ప్రతిపక్ష నాయకులు ఇష్టానుసారంగా మాట్లాడుతున్నారని నిరసన తెలుపుతూ స్థానిక మూడు గ్రామ సచివాలయాలకు చెందిన ఎనిమిది మంది గ్రామ వలంటీర్లు రాజీనామాలు చేశారు. తమ రాజీనామాలను పంచాయతీ కార్యదర్శి ఎం.ప్రసాద్‌కు బుధవారం అందజేశారు. ఎన్నికల కమిషన్ కూడా తమను వలంటీర్ విధులు నిర్వర్తించకుండా అడ్డుకోవడం మనస్తాపానికి గురిచేసిందని, ఎన్నికల ప్రక్రియ పూర్తయ్యే వరకూ స్వచ్ఛందంగా తప్పుకోవాలని ఈ రాజీనామా చేస్తున్నట్టుగా తమ రాజీనామా పత్రాల్లో పేర్కొన్నారు.

ప్రతిఒక్కరూ ఫ్యాను గుర్తుకు ఓటేయాలి



గంద్రేడులో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి



ఫ్యాన్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థిస్తున్న ఎమ్మెల్యే సతీమణి ఆదిలక్ష్మి

పెదపూడి: ప్రతిఒక్కరూ ఫ్యాన్ గుర్తుకు ఓటు వేసి వైఎస్సార్ సీపీని భారీ మెజార్టీతో గెలిపించాలని ఎమ్మెల్యే డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డి సతీమణి ఆదిలక్ష్మి అన్నారు. బుధవారం మండలంలోని గంద్రేడు గ్రామంలో ఆమె ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఆమెకు మహిళలు హారతులిచ్చి పూలమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలతో నిరుపేదల కుటుంబాల్లో వెలుగులు నిండాయన్నారు. కుల, మత, రాజకీయాలకు అతీతంగా సంక్షేమ పథకాలు అమలుచేస్తున్న ఘనత సీఎం జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. విద్య, వైద్య రంగాల్లో విప్లవాత్మక సంస్కరణలు చేపట్టిన గొప్ప మనసున్న ముఖ్యమంత్రి జగనన్న అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఎమ్మెల్యేగా తన భర్త డాక్టర్ సత్తి సూర్యనారాయణరెడ్డిని, ఎంపీగా డాక్టర్ గూడూరి శ్రీనివాస్‌ను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో ఎంపీపీ కేతా తులసి, జెడ్పీటీసీ సభ్యురాలు వేపకాయల వెంకటలక్ష్మి, సర్పంచ్ కూడిపూడి మాధవీలత, పి.చంద్రకళ, మేడపాటి విజయ, కూడిపూడి శ్రీనివాస్, విత్తనాల గాంధీ, విత్తనాల శ్రీనివాస్, ఇళ్ల సురేష్, ఉప్పలపాటి రవి, నూని వీర వెంకట సత్యనారాయణ, మేడపాటి నాగమోహన్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవాతత్పరులు ఆర్యవైశ్యులు



ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యంను సన్మానించిన ఆర్యవైశ్యులు

ఆత్మీయ సమ్మేళనంలో ఎమ్మెల్యే జక్కంపూడి రాజా

సీతానగరం: సమాజసేవ తత్పరులు ఆర్యవైశ్యులని వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు, రాజానగరం ఎమ్మెల్యే జక్కంపూడి రాజా అన్నారు. స్థానిక జీవీకే కన్వెన్షన్ హాల్‌లో ఏపీఐఐసీ మాజీ చైర్మన్ శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యం ఆధ్వర్యంలో మండల ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశం మంగళవారం రాత్రి నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్యఅతిథి ఎమ్మెల్యే జక్కంపూడి రాజా మాట్లాడుతూ గత ప్రభుత్వాలు ఆర్యవైశ్యులను ఓటు బ్యాంకుగా మాత్రమే పరిగణించాయని, జగనన్న పాలనలో అగ్రవర్ణాల పేదల కోసం ఈబీసీ నేస్తం వంటి పథకాన్ని అమలు చేస్తున్నారన్నారు. ఆర్యవైశ్యులకు ఏ అవసరం వచ్చినా అండగా ఉంటామని, వారి సంక్షేమానికి కృషి చేస్తామన్నారు. వైఎస్సార్ సీపీ అధికారం చేపట్టాక గ్రామాల్లో కోట్లాది రూపాయలతో పెద్ద ఎత్తున అభివృద్ధి పనులు చేసినట్టు చెప్పారు. సీతానగరం రోడ్డును రూ.104 కోట్లతో అభివృద్ధి చేస్తున్నామన్నారు. సీతానగరంలో క్రీడా వికాస కేంద్రంతో పాటు, రఘుదేవపురంలో 30 పడకల సీహెచ్‌సీ, బొబ్బిల్లంకలో మరో పీహెచ్‌సీ నిర్మిస్తున్నామని వివరించారు. రూ.91 కోట్లతో తొర్రిగడ్డ డ్రెయిన్‌పై బొబ్బిల్లంక వద్ద గోదావరిలో రివర్స్ పంపింగ్ స్కీమ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. ఆర్యవైశ్యుల కోసం కమ్యూనిటీ భవన నిర్మాణం కోసం స్థలాన్ని కేటాయిస్తామని తెలిపారు. శివరామ సుబ్రహ్మణ్యం మాట్లాడుతూ ఆర్యవైశ్యుల అభ్యున్నతి కోసం సీఎం జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. రాజానగరం నియోజకవర్గ అభివృద్ధికి నిరంతరం పాటుపడుతున్న జక్కంపూడి రాజా గెలుపు కోసం ఆర్యవైశ్యులందరూ కృషి చేయాలని కోరారు. 70 ఏళ్లు పైబడిన 50 మంది దంపతులను, శ్రీఘాకోళ్లపు శివరామ సుబ్రహ్మణ్యంను, ఎమ్మెల్యే జక్కంపూడి రాజాను ఆర్యవైశ్యులు ఘనంగా సన్మానించి, ఉగాది పురస్కారాలు అందించారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య ప్రముఖులు పువ్వాడ కృష్ణ, కంకటాల రమేష్, జయవరపు గంగరాజు, చెల్లంచర్ల కిషోర్, కల్లేపల్లి కృష్ణ, పంజ్జారి నాగేశ్వరరావు, కొల్లేపర సాయి, రోశయ్య, మండవల్లి జయ, గూడెపు శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ఆయన రూటే సెపరేటు

- శంకుస్థాపన చేసిన కొద్ది రోజుల్లోనే రోడ్ల నిర్మాణం
- వాహన చోదకులకు తప్పిన ఇక్కట్లు
- మంత్రి వేణు చొరవకు ప్రజల్లో హర్షాతిరేకాలు



బొమ్మూరు రాఘవేంద్ర కాలనీ నుంచి బాలాజీపేట సెంటర్ రోడ్డు



తూర్పు రైల్వేస్టేషన్ నుంచి బాలాజీపేట రోడ్డు

రాజమహేంద్రవరం రూరల్: ఒకప్పుడు ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బొమ్మూరు వరకున్న ఆర్‌అండ్‌బీ రోడ్డుతో పాటు, తూర్పు రైల్వేస్టేషన్ నుంచి బాలాజీపేటకు వచ్చే రోడ్డులో ప్రయాణించాలంటేనే వాహనచోదకులు తీవ్ర ఇబ్బందులు పడేవారు. మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ రూరల్ నియోజకవర్గ కో–ఆర్డినేటర్‌గా బాధ్యతలు స్వీకరించడంతో ఈ నియోజకవర్గంలో అనేక సమస్యలకు మోక్షం లభించింది. వీటిలో రోడ్ల నిర్మాణం సైతం పూర్తికావడంతో రయ్‌రయ్ అంటూ వాహనాలు దూసుకుపోతున్నాయి. దీని వివరాలు ఇలా ఉన్నాయి.

ఐఎల్‌టీడీ సెంటర్ నుంచి బొమ్మూరు వరకున్న ఆర్‌అండ్‌బీ గోతులమయంగా ఉండేది. అంతేకాకుండా రైతుబజార్ వద్ద కల్వర్టు సైతం శిథిలావస్థకు చేరింది. ఇది చూసిన మంత్రి వేణుగోపాలకృష్ణ వెంటనే జిల్లా ఉన్నతాధికారులతో మాట్లాడడంతో పాటు, త్వరితగతిన రోడ్డు నిర్మాణం జరిగేలా చర్యలు చేపట్టారు. ఐఎల్‌టీడీ ఫ్లెటైవర్ నుంచి బొమ్మూరు వరకూ ఆర్అండ్‌బీ రోడ్డు నిర్మాణం చకచకా పూర్తి చేశారు. అలాగే శంభూనగర్ రైతుబజార్ వద్ద నగరపాలక సంస్థ నిధులతో కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేయడంతో పాటు, త్వరితగతిన నిర్మాణం పూర్తి చేసేలా చర్యలు చేపట్టారు. నగరపాలక సంస్థ 16వ డివిజన్ పరిధిలో తూర్పు రైల్వేస్టేషన్ నుంచి బాలాజీపేట సెంటర్ వరకు రోడ్డు అధ్వానంగా ఉంది. దీంతో మంత్రి వేణుగోపాలకృష్ణ నగరపాలక సంస్థ నిధులతో రోడ్డు నిర్మాణం పూర్తి చేయించారు. రోడ్డు నిర్మాణం పూర్తికావడంతో వాహనచోదకులు ప్రయాణం సాఫీగా సాగుతోంది. గతంలో రోడ్లు అధ్వానంగా ఉండడంతో అనేక ఇబ్బందులు పడిన ప్రజలు.. రోడ్ల నిర్మాణం పూర్తికావడంతో హర్షాతిరేకాలు వ్యక్తం చేస్తున్నారు. అభివృద్ధి పనులకు శంకుస్థాపనలు చేస్తున్న సమయంలో రూరల్ ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి.. శిలాఫలకాల మంత్రి అని వేణుగోపాలకృష్ణను ఎద్దేవా చేసినా పట్టించుకోలేదు. ప్రజలకు మాటిస్తే దానిని తప్పక అమలు చేసి, ఆచరణలో చూపిన వేణుగోపాలకృష్ణను సేవ చేసే మంత్రిగా ఆయా ప్రాంతాల ప్రజలు కొనియాడుతున్నారు.